క్లుప్తంగా

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

దెందులూరు: పోతునూరు గ్రామంలోని కోదండ రామాలయంలో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా భక్తులు హనుమాన్ చాలీసా నిర్వహించారు. గ్రామంలోని భక్తులు ఆలయానికి వచ్చి స్వామి వార్లను దర్శించుకొని పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

మురుగు నీటిని తొలగించాలని వినతి



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

దెందులూరు: చల్లచింతలపూడి గ్రామంలో దేవాలయం ఎదుట వీధిలో మందుల షాపు ఎదురుగా మురుగు నీరు నిలిచిపోవడంతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, గ్రామ మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ అన్నారు. ఆదివారం చల్ల చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ గతంలో డ్రెయిన్ తవ్వుతుంటే మురుగు నీరు ఉన్న పక్క ఇంటి వారు తవ్వనివ్వలేదని దీంతో ఈ వీధిలో వారు దుర్వాసన, దోమలు, ఈగలతో పాటు అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. అధికారులు సమస్యను పరిశీలించి పరిష్కారం చేయాలని జిల్లా కలెక్టర్‌కు సోమవారం లిఖిత పూర్వకంగా అందిమాని ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ తెలిపారు.

క్యాన్సర్ బాధితురాలికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న చేయూత సంస్థ సభ్యులు

దెందులూరు: గోపన్నపాలెం గ్రామానికి చెందిన పసుపులేటి కుమారి గత కొంత కాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఉందని చేయూత సంస్థ సభ్యులు అన్నారు. భర్త లేక పోవడం కొడుకు హోటల్‌లో పని చేయడం సొంత ఇల్లు కూడా లేక పడుతున్న ఇబ్బందులు గమనించి తమ సంస్థ చేయూత ద్వారా రూ.11 వేల నగదు, నిత్యావసర వస్తువులు ఆర్థిక సాయమందించామని సంస్థ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఎం.లక్ష్మీనారాయణ, పి.నాగార్జునరావు, ఎం.లక్ష్మణరావు, వి.రాజేంద్ర, ఇ.శరత్‌బాబు, జి.దుర్గారావు, ఆర్.మహేష్ పాల్గొన్నారు.

రాట్నాలమ్మకు ప్రత్యేక పూజలు



రాట్నాలమ్మ వారు

పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువుగా వెలసిల్లిన శ్రీరాట్నాలమ్మకు పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పెదవేగి మండలం రాట్నాలకుంట గ్రామంలో ఉన్న శ్రీరాట్నాలమ్మ దేవస్థానంలోని అమ్మవారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవారం అమ్మవారికి పూజా రుసు ముల ద్వారా రూ.54,070, విరాళాల ద్వారా రూ.15,326, లడ్డూ ప్రసాదంద్వారా రూ.21,990, పులిహోర అమ్మకంద్వారా రూ.3,150, ఫొటోల అమ్మకం ద్వారా రూ.3,245 ఆదాయం లభించగా, మొత్తం ఆదాయం రూ.94976 లభించిందని దేవస్థాన కార్య నిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్ తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం



చర్చికి ఆర్థిక సాయమందిస్తున్న దాత

దెందులూరు: గ్రామంలోని సాల్వేషన్ ఆర్మీ చర్చి నిర్మాణానికి దాత బత్తిన శ్రీనివాసరావు కుమారుడు లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం చర్చిలో సాల్వేషన్ ఆర్మీ కోర్ ఆఫీసర్ మేజర్ కె.రమణయ్యకు నగదును అందించారు. దాత కుటుంబ సభ్యులను కోర్ ఆఫీసర్ రమణయ్య అభినందించారు.

తిరోగమనంలో రూప్‌చంద్ ధర

- గణనీయంగా తగ్గిన ధరలు
- నష్టాల ఊబిలో చేపల రైతులు
- తగ్గిన ధరతో రూప్‌చంద్ రైతుల దిగాలు



రూప్‌చంద్ చేపలు

గణపవరం: ఈ ఏడాది ఆరంభం నుంచి మంచి ధర పలికిన రూప్‌చంద్ చేపల ధర తిరోగమనం పట్టింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గత ఏడాది రైతులను నష్టాల ఊబిలో దింపిన రూప్‌చంద్ చేప ఈ ఏడాది జనవరి నుంచి కనీవినీ ఎరుగని రీతిలో ధర పెరిగింది. రికార్డు స్థాయిలో కిలో రూప్‌చంద్ ధర ఏకంగా రూ.125 నుంచి రూ.130 వరకూ పలికింది. మరలా తిరిగి ధర కిలో రూ.70 వరకూ పడిపోయి రైతులకు చుక్కలు చూపించింది. అయితే గత ఏడెనిమిది నెలలుగా ధర పెరుగుతూ కిలో రూ.130 వరకూ చేరినా ఎక్కువ కాలం రూ.125 మీదే నిలిచింది. అంటే గత ధరతో పోలిస్తే దాదాపు 70 నుంచి 80 శాతం ఎక్కువన్న మాట. ఈ ధరలో అమ్ముకున్న రైతులు బాగానే లాభపడ్డారు. అయితే గత నెలరోజులుగా రూప్‌చంద్ ధర క్రమేపీ తగ్గుతూ ప్రస్తుతం రూ.111నుంచి రూ.113మధ్య పలుకుతుంది. అంటే నెలరోజుల వ్యవధిలోనే కిలోకు దాదాపు రూ.12నుంచి రూ.18వరకూ ధర పడిపోయింది.

పడిపోయిన రూప్‌చంద్ సాగు

రూప్‌చంద్ చేప సాగులో ఉన్న సౌలభ్యం దృష్ట్యా ఎక్కువ మంది రైతులు రూప్‌చంద్ రకం చేప సాగు చేసేవారు. గత రెండేళ్లుగా రూప్ చంద్ చేప ధర కిలో రూ.90 నుంచి, రూ.105 మధ్య ఊగిసలాడుతూ ఉండేది. ఈ ధరలో రైతుకు లాభాల మాట ఎలా ఉన్నా పెట్టుబడికి ఢోకా ఉండేది కాదు. అయితే అనూహ్యంగా గత ఏడాది ఆరంభంలో దీని ధర కిలో రూ.65కు పడిపోయింది. అప్పట్లో పెట్టుబడికి వచ్చిన రైతులు ఇదే ధరకు అమ్ముకొని తీవ్రంగా నష్టపోయారు. దీంతో చాలా మంది రైతులు రూప్‌చంద్ సాగు వదిలేసి రొయ్యల సాగుకు, తెల్ల చేపల సాగుకు మళ్లారు. దీంతో రూప్ చంద్ సాగు గణనీయంగా పడిపోయి, చేప ధర అమాంతం పెరిగి పోయింది.

నష్టపోయిన రైతులు గట్టెక్కేనా?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 150 లక్షల ఎకరాల్లో చేపల సాగు నిర్వహిస్తుండగా దాదాపు 80 వేల ఎకరాల్లో రూప్‌చంద్ చేప సాగు చేసేవారు. అయితే ఈ చేప సాగు చేసిన రైతులు నష్టాల పాలవడంతో చాలా మంది రూప్‌చంద్ సాగుకు స్వస్తి పలికారు. తగినంత ఉత్పత్తి లేకపోవడంతో రూప్‌చంద్‌కు మంచి గిరాకీ ఏర్పడింది.

రూప్‌చంద్ సీడ్‌కు గిరాకీ



రూప్‌చంద్ చేప ధర పెరగడంతో ఇంతకాలం మందకొడిగా ఉన్న రూప్‌చంద్ చేప పిల్ల ధర బాగా పెరిగింది. రెండేళ్లుగా రూప్‌చంద్ చేప పిల్ల కొనే నాధుడు లేక పెంపకందారులు తీవ్రంగా నష్టపోయారు. రెండు నుంచి నాలుగు అంగుళాల రూప్‌చంద్ పిల్ల ధర రూ.6 నుంచి రూ.3కు పడిపోయింది. దీంతో చేప పిల్లల పెంపకందారులు నష్టపోయారు. ప్రస్తుతం రూప్‌చంద్ ధర పెరగడంతో పిల్ల ధర కూడా రూ.3 నుంచి రూ.4 వరకూ పెరగడంతో సీడ్ రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

– యర్రా ఆదినారాయణ, రూప్‌చంద్ సీడ్ రైతు

అవసరమైన మేరకు చేప లేదు



ప్రస్తుతం మార్కెట్లో అవసరం మేరకు తగినంత రూప్‌చంద్ చేప లభించడంలేదు. దీనితో ఈ చేప ధర గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం కిలో రూ.113కు కొనుగోలు చేస్తున్నాం. గత నెల రోజుల క్రితం వరకూ రూ.130 వరకూ ధర పలికింది. గణపవరం నుంచి ప్రతి రోజూ 30 నుంచి 40 టన్నుల వరకూ రూప్‌చంద్ ఎగుమతి అయ్యేది. తగినంత సరకు లేకపోవడంతో కొంత కాలంగా రోజూ 10 నుంచి 15 టన్నులు మాత్రమే ఎగుమతి అవుతుంది.

– నిమ్మల రామకృష్ణ, చేపల వ్యాపారి

రైతుల్లో మళ్లీ ఆందోళన



రూప్‌చంద్ సాగు చేసి రెండేళ్లుగా నష్టపోతున్న రైతులకు ఈ ఏడాది చేప ధర పెరగడంతో ఊరట లభించింది. ఎప్పుడూ కిలో రూ.100 దాటి ఎరుగం. ఎక్కువగా రూ.65 నుంచి రూ.80 మధ్యనే ధర ఉండేది. దీంతో రైతులకు కేజికి రూ.20 వరకూ నష్టం వచ్చేది. ఈ ఏడాది రూప్‌చంద్ ధర ఎక్కువ కాలం కిలో రూ.125 మీద నిలబడటం వలన రైతులు తమ నష్టాలను పూడ్చుకోగలిగారు. మళ్లీ రూప్‌చంద్ ధర తగ్గుముఖం పట్టడం రైతుల్లో ఆందోళన కలిగిస్తుంది.

– సంకు శ్రీనివాసరావు, రైతు

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి పూజలు చేస్తున్న గ్రామ పెద్దలు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయ నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ వేద పండితుల మంత్రోచ్ఛరణ నడుమ ఈ కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆలయ పూజారి మంగవతి ఆచార్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. దాతలు పత్సమట్ల భీమరాజు, శిరిబత్తిన కొండబాబులను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో వంశీ, గ్రామ పెద్దలు దాట్ల సీతారామరాజు, వగ్వాల అచ్యుతరామారావు, కాకోతుల సోమేశ్వర రావు, ఆశీర్వాదం, పూజారులు లంకా శివకుమార్, శ్రీనివాసశర్మలు, భక్తులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఉంగుటూరు: విద్యుత్ మరమ్మతులు, నూతన లైన్ల ఏర్పాటు నేపథ్యంలో ఈ నెల 10వ తేదీన గొల్లగూడెం, కైకరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. కావున కైకరం డొమెస్టిక్, రామన్నగూడెం ఫీడర్ పరిధిలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు యోగాపై అవగాహన ర్యాలీ



ఎంపీడీఓ కె.శ్రీదేవి

దెందులూరు: మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలో సోమవారం యోగా ర్యాలీ నిర్వహించాలని దెందులూరు ఎంపీడీఓ కె.శ్రీదేవి ఆదేశించారు. ఆదివారం దెందులూరు ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ అన్ని సచివాలయాల గ్రామ కార్యదర్శులు, మాస్టర్ ట్రైనర్లు ట్రైనర్లు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలు విధిగా అమలు చేయాలనే సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరికీ కివ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ మెరుగైన జీవన విధానం క్రమ శిక్షణ కుటుంబ అభివృద్ధి లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి మోదీ యోగ విశ్వ వ్యాప్తం చేసే కార్యక్రమంలో భాగంగా ఇస్తు న్న శిక్షణను ప్రతిఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలన్నారు. స్వచ్ఛందసంస్థలు, మేధావులు ఉద్యోగులు యువత మహిళలతోపాటు ప్రజలందరూ ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజా భాగస్వామ్యంతోనే సమాజానికి మేలు చేసే పథకాలు విజయవంతమవుతాయని ఎంపీడీవో అన్నారు.

ప్రతి ఒక్కరూ ర్యాలీలో పాల్గొనాలి

పెదవేగి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా నేడు అవగాహన ర్యాలీ నిర్వహించాలని ఎంపీడీఓ పి.శ్రీనివాస్ తెలిపారు. దీనికి సంబంధించి ప్రతి సచివాలయ కార్యదర్శి, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, నాయకులు అందరూ సోమవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు ర్యాలీ నిర్వహించాలని ఎంపీడీవో తెలిపారు. సచివాలయ స్థాయిలో యోగా శిక్షణ కార్యక్రమం ట్రైనర్లు గ్రామస్తులకు శిక్షణ ఇవ్వాలని, ఈ శిక్షణ కార్యక్రమం ఈ నెల 9 నుంచి నాలుగు రోజులు ఉంటుందన్నారు. యోగా ట్రైనర్లు శిక్షణ కార్యక్రమం నిర్వహణకు ఏర్పాటు చేసుకోవలసిందిగా ఎంపీడీఓ తెలిపారు.

సాంకేతిక వ్యవసాయంతో లాభసాటి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏడీఏ లలితాసుధ

భీమడోలు: వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించి, సుస్థిరమైన లాభసాటి వ్యవసాయాన్ని ప్రోత్సహించడమే వికసిత కృషి సంకల్ప అభియాన్ లక్ష్యమని ఏలూరు ఏడీఏ లలితసుధ అన్నారు. భీమడోలు సచివాలయం నంబర్-1 వద్ద ఆదివారం రైతులు, కౌలు రైతుల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు భీమడోలు ఏవో ఎస్‌పీఎల్ ఉషారాణి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా ఏడీఏ లలితాసుధ, వెంకట్రామన్నగూడెం శాస్త్రవేత్త డాక్టర్ పి.విజయలక్ష్మి, పెదవేగి ప్రధాన శాస్త్రవేత్త రామచంద్రుడు, ఏఎంసీ చైర్మన్ శేషపు గిరి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంపును తట్టుకునే వరి వంగడాలైన ఎంటీయూ 1312, 1318, 1310, 1229 రకాల గురించి రైతులకు వివరించారు. తద్వారా వర్షాలు, ఇతర చీడపీడల నుంచి వరి పంటను రక్షించుకొనేందుకు ఈ వంగడాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. పుట్ట గొడుగుల పెంపకం, తేనెటీగల పెంపకం ద్వారా అధిక ఆదాయం పొందడం ఖాయమన్నారు. డ్రోన్ పద్ధతిలో పిచికారీ విధానాలపై రైతుల అనుమానాలను నివృత్తి చేశారు. ఎఎంసీ చైర్మన్ శేషపు గిరి మాట్లాడుతూ శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారుల సూచనలు, సలహాలను పాటిస్తే రైతులు తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందుతారన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు కుక్కల ప్రసాద్, వార్డు సభ్యుడు జక్కంశెట్టి లక్ష్మణ్, రైతులు, వీఏఏలు పాల్గొన్నారు.

దివ్యాంగులను ఆదుకోవాలి



దివ్యాంగులకు బియ్యం, పళ్లు అందజేస్తున్న దాట్ల విజయరామరాజు

భీమడోలు: దివ్యాంగులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని పలువురు కోరారు. గుండుగొలనులోని శ్రీవిఘ్నేశ్వర దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో 66 మంది దివ్యాంగులకు నెలవారీ వితరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. దాతలు గ్రామానికి చెందిన యూఎస్ఏలో ఉంటున్న పిన్నమరాజు సూర్యచంద్ర సత్యనారాయణ రంగ వర ప్రసాద్ రాజు, హైదరాబాద్‌కు చెందిన సుభాష్ వర్మ ఆర్థిక సాయంతో దివ్యాంగులకు సన్నబియ్యం, పౌష్టికాహారాన్ని అందించారు. దివ్యాంగులకు పళ్లను పంపిణీ చేశారు. పెద్దలు దాట్ల విజయరామరాజు చేతుల మీదుగా దివ్యాంగులకు అందించారు. ఈ సందర్భంగా దాతలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మంతెన సుబ్బరాజు, సత్యనారాయణరాజు, పేరిచర్ల కేశవరాజు, నంబూరి బాబులు రాజు, సరిపల్లి రామకృష్ణంరాజు, నల్లపురాజు ఆంజనేయరాజు, విఘ్నేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గోడ కూల్చివేత అభ్యంతరకరం

దెందులూరు: ఎంపీటీసీ సింహాద్రి పద్మావతి, మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ ప్రహరీ గోడ కూల్చివేత తీవ్ర అభ్యంతరకరమని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం రాత్రి చల్లచింతలపూడి బస్టాండ్ సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలు హుందాగా చేయాలే తప్ప కక్షపూరిత ధోరణితో నిర్మించిన ఇళ్లను ధ్వంసం చేయడం, గోడలు కూల్చడం, అక్రమ కేసులు పెట్టడం వంటి చర్యలకు పాల్పడకూడదన్నారు. నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులకు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అండగా నిలుస్తారని, ఎవ్వరూ అధైర్యపడొద్దని చెప్పారు. సమావేశంలో మాజీ సర్పంచ్ సింహాద్రి శ్రీమన్నారాయణ, పార్టీ నాయకులు వేమన నాగరాజు, బైగాన్ని అంకాలు, బి.రాంపండు, ములకాల రామకృష్ణ, మోదుగమూడి బాబి, ఎం.శ్రీను, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారం



కొప్పాకలో భగవద్గీత ప్రచారం చేస్తున్న హిందూ జ్ఞాన వేదిక సమితి సభ్యులు

పెదవేగి: మనిషి ఎప్పటికీ మారని జీవ కులంలో ఎప్పటికీ మారని దైవమతంలో ఉన్నాడనే సత్యం గ్రహించాలని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షుడు అరుణ్ కుమార్ అన్నారు. ఆదివారం త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెదవేగి మండలంలోని కొప్పాక గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ త్రైత సిద్ధాంత జ్ఞాన గ్రంథాల ప్రచారం నిర్వహించారు. దైవ జ్ఞానం ప్రకారం మనిషి తెలియకుండానే ఎప్పటికీ మారని కులంలో, మతంలో ఉన్నాడని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞాన వేదిక నూజివీడు కమిటీ అధ్యక్షులు, సభ్యులు అరుణ్ కుమార్, కోటేశ్వరరావు, అశోక్, శ్రీకాంత్, రామాంజనేయులు, సుందర్‌రావు, మోహన్ కుమార్, శివనాగేశ్వరి పాల్గొన్నారు.

● డోంట్ కేర్!



వాహనాలు నిలుపరాదని బోర్డు పెట్టిన చోటే ఆపిన వాహనం

దెందులూరు: జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన పోలీస్ హెచ్చరిక బోర్డులను వాహన యజమానులు లెక్క చేయడం లేదు. ప్రతి రోజూ బోర్డు ఎదుట, వెనుక రహదారి పైనే వాహనాలు యథేచ్ఛగా ఆపుతున్నారు. గత రెండు, మూడు నెలల్లో హోటళ్ల వద్ద అనేక ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. పోలీస్ హెచ్చరిక బోర్డులను వాహనాల యజమానులు ఖాతరు చేయకపోతే ఎలాగని ఇలాగైతే ప్రమాదాలు ఎలా ఆగుతాయని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన పోలీసు యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుందని విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. జిల్లా పోలీసు అధికారులు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

నృసింహునికి పంచామృతాభిషేకాలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో ఆదివారం విశేష పూజా కార్యక్రమాలు జరిగాయి. స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతిని పురస్కరించుకుని ముందుగా ఆలయంలో అర్చకులు, పండితులు విఘ్నేశ్వర పూజ, పుణ్యహవాచనం, మండపారాధనను నిర్వహించారు. ఆ తరువాత వేద మంత్రోచ్ఛరణల నడుమ సుదర్శన నారసింహ ధన్వంతరీ గరుడ ఆంజనేయ అనంత సుబ్రహ్మణ్య మూలమంత్ర హోమాలను జరిపారు. ఆ తరువాత గర్భాలయంలో కొలువైన స్వామివారి మూలవిరాట్‌కు విశేష పంచామృతాభిషేకాలు, నక్షత్ర హారతులు, నీరాజన మంత్రపుష్పాలను సమర్పించారు. ఆఖరిలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ఘనంగా గంగానమ్మ విగ్రహ ప్రతిష్ఠ



గంగానమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు



ప్రతిష్ఠించిన గంగానమ్మ అమ్మవారి విగ్రహం

బుట్టాయగూడెం: మండలంలోని తెల్లంవారిగూడెంలో గ్రామదేవత గంగానమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, ఆయన సతీమణి రాజ్యలక్ష్మి చేతుల మీదుగా గ్రామపెద్దలు, భక్తుల సమక్షంలో అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా బాలరాజు దంపతులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. గిరిజన సంస్కృతి, సాంప్రదాయ పద్ధతిలో ఈ కార్యక్రమం నిర్వహించారు. పురోహితులు అనిపెద్ది విశ్వనాథశర్మ పూజా కార్యక్రమాలను జరిపారు.సర్పంచ్ తెల్లం రాముడు దంపతులు కూడా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పరిసర గ్రామాల నుంచి పలువురు భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

మురుగు డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలి

- గుర్రపుడెక్కతో పూడిపోయిన పలు డ్రెయిన్లు
- వేసవి పూర్తవుతున్నా ఆ పనుల జాడ లేదు
- ముంపు బారిన పడే అవకాశం ఉందంటున్న రైతులు



గుర్రపుడెక్కతో నిండిపోయిన పందికోడు డ్రెయిన్

ఉంగుటూరు: ఉంగుటూరు మండలంలో డ్రెయిన్లను ప్రక్షాళన చేయాలని రైతులు కోరుతున్నారు. డ్రెయిన్ల తవ్వకం ఈ ఏడాది పూర్తవుతుందా అని రైతులు మీమాంసలో ఉన్నారు. వేసవి పూర్తవుతున్నా డ్రెయినేజీ శాఖ అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడమే దీనికి కారణం. ఉంగుటూరు మండలంలలో మీడియం, మేజర్, మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. పంట పొలాల మధ్యలో ఉన్న ఈ డ్రెయిన్లలో పూడికతీత పనులు చేపడితేనే వర్షకాలంలో వచ్చే అధిక వర్షాల సమయంలో నీరు, మురుగు నీరు, లాగే వీలు ఏర్పడుతుంది. ప్రస్తుతం పూడికతీత పనులను చేయకపోతే నీరు లాగక ఎగపోటు వచ్చి పంట చేలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఈ పరిస్థితి ఉంగుటూరు మండలంలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ నేపథ్యంలో వేసవిలో కాలువలు కట్టేసి నెల రోజులు అయినా డ్రెయిన్ల తవ్వ పనులు మొదలు పెట్టలేదు. అధికారులు ఇంకా ప్రతిపాదనలకే పరిమితమయ్యారంటే రైతుల మీద ప్రభుత్వానికి ఏ మాత్రం శ్రద్ధ ఉందో అర్థమవుతోంది. మురుగు కాలువలు గుర్రపుడెక్క, తూడుతో నిండిపోయాయి. మండలంలో తోకలపల్లి, పందికోడు మేజర్‌కోడుగా ఉన్నాయి. అలాగే 2, 3, 4, నెంబర్లు గల మీడియం డ్రెయిన్లు, 20కి పైగా మైనర్ డ్రెయిన్లు ఉన్నాయి. ఈ రెండు మురుగు కోడులు ఇంత వరకు తవ్వ చేపట్టలేదు. నాచు, గుర్రపు డెక్క తీసే పనులు నిర్వహించలేదు. ప్రస్తుతం రైతులు సార్వా పనులు మొదలు పెట్టే పనిలో నిమగ్నమవుతున్నారు. ఈ తరుణంలో పనులు చేపట్టినా సమగ్రంగా జరగవని రైతులు అంటున్నారు. ఏదో రైతు కన్నీళ్లు తుడవడానికి మినహా ఆఖరి నిమిషంలో తూతూమంత్రంగా తవ్వ పనులు చేసి, మమ అనిపిస్తారని రైతులు పెదవి విరుస్తున్నారు.

త్వరలో పనులు మొదలు పెడతాం

త్వరలోనే గుర్రపుడెక్క, కర్రనాచు తొలగింపు పనులు చేపడతామని దీని కోసం రూ.23 లక్షల నిధులు మంజూరయ్యాయని డ్రెయినేజీ శాఖ మండల ఏఈ వెంకటేశ్వర రావు తెలిపారు. అలాగే తవ్వకాలకు ప్రతిపాదనలు పంపామని అనుమతి రాగానే పనులు మొదలు పెడతామన్నారు. రైతులకు ఇబ్బంది లేకుండా తవ్వకం పనులు పూర్తి చేస్తామని వివరణ ఇచ్చారు.